VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
శనివారం 11 మే 2024
సంపుటి.01 సంచిక.297



## నగరంలో సంక్రాంతి
# సందడి
ఓటేసేందుకు సొంతూర్లకు సెటిలర్లు
కిటకిటలాడిన బస్ స్టాండ్లు
2 లో

## కట్టు కథలతో అల్లిన స్టోరీ ఢిల్లీ ఎక్సైజ్ కేస్
ఇంటర్వ్యూలో వెల్లడించిన కెటిఆర్

2 లో




# దేశం కోసం బిజెపి గెలవాల్సిందే

పౌరస్మృతి, 370 వ్యతిరేకులు ఎగిరిపోవాల్సిందే
పటిష్ట భారత్ నిర్మాణమే మా లక్ష్యం
గత పదేళ్లుగా అనేక రంగాల్లో విజయం సాధించాం
సనాతన సంస్కృతికి వారసత్వానికి భారత్ నిలయం
కాంగ్రెస్ హయాంలో బాంబుల మోతలు వినిపించేవి
వాటిని లేకుండా ప్రజలు స్వేచ్ఛగా తిరిగేలా చేసాం
కాంగ్రెస్‌కు ఫారిన్ లెన్స్‌తో చూడడమే అలవాటు
తెలంగాణకు ఉజ్వల భవిష్యత్‌ను ఇస్తాం
ఎల్బీ స్టేడియంలో ఫినిషింగ్ టచ్ ఇచ్చిన ప్రధాని మోడీ

కాంగ్రెస్‌కు వేసే ఓటు ఉగ్రవాదులను పెంచిపోషిస్తుంది. దేశాన్ని మరోసారి ఉగ్రవాదుల గుప్పిట్లోకి తీసుకెళ్తుంది. మధ్యతరగతికి పూర్తి వ్యతిరేకంగా వ్యవహరించే పార్టీ కాంగ్రెస్. యువరాజు పలు అంశాలపై ట్యూషన్ చెప్పించుకుంటున్నారు. ట్యూషన్ చెప్పేవాళ్లు.. రామమందిర నిర్మాణం, శ్రీరామనవమి నిర్వహణ తప్పంటున్నారు. పూజ చేయడం దేశద్రోహమా? భారతదేశాన్ని విదేశీ కళ్లద్దాల నుంచి చూసే కాంగ్రెస్.. భారతదేశం ఔన్నత్యాన్ని అంచనా వేయలేదు. భారతదేశం అంటే వేల సంవత్సరాల చరిత్రకు, సంస్కృతికి ప్రతిబింబం. వసుధైక కుటుంబం.

-ప్రధాని మోదీ

**హైదరాబాద్:** నాలుగోవ విడత పార్లమెంట్ ఎన్నికల ప్రచారం తుది దశకు చేరుకుంది. ప్రధాని మోదీ తెలంగాణ ఎన్నికల ప్రచారం శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఎల్బీ స్టేడియం సభలో పాల్గొన్న మోదీ.. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క.. అన్నట్లు ప్రధాని మోదీ ప్రసంగం అడుగడుగునా ఉద్రూతలు ఊగిస్తూ సాగింది. ప్రధాని విషయాన్ని స్పష్టంగా ప్రజలకు వివరిస్తుంటే, జనం నుంచి అంతే స్థాయిలో రియాక్షన్ రావడంతో, ఎల్బీ స్టేడియం మొత్తం మోదీ నినాదాలతో మార్మోగింది. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల్లో 10 నుంచి 12 సీట్లు గెలవాలన్నదే టార్గెట్‌గా కమలనాథులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అందుకే అగ్రనేతలు తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్, మల్కాజిగిరి, చేవెళ్ల, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను కలిపి ఎల్బీ స్టేడియంలో బీజేపీ నేతలు భారీ బహిరంగ సభ నిర్వహించారు. అయితే.. చివరి సభలో మోదీ, తీవ్రస్థాయిలో విపక్షాలపై విరుచుకుపడ్డారు. జూన్ 4 తర్వాత ఉమ్మడి పౌరస్మృతి వ్యతిరేకులు, ఆర్టిక్ 370 రద్దు వద్దన్న వ్యక్తులు పారిపోక తప్పదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దేశంలోని 140 కోట్ల మంది కాషాయ పార్టీని గెలిపించాలని సంకల్పం

మిగతా 2లో


2 లో

## లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి
పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు
హైదరాబాద్ ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్


2 లో

# చేనేతలను ఆదుకున్న ఘనత మాదే

బీజేపీ ఎజెండాలో పేదలు లేరు
పెద్దపెద్ద గద్దలే వారి జాబితాలో ఉన్నారు
చేనేతపైనా జిఎస్టీ వేసి చంపారు
సిరిసిల్ల కార్నర్ మీటింగ్‌లో కెసిఆర్



చేనేతలకు ఉన్న ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని స్కీమ్స్ రద్దు చేశారు మోదీ. చేనేత కార్మికులంటే లెక్కనే లేదు. బీజేపీ ఎజెండాలో పేదలు, కార్మికులు, రైతులు, ఆటో రిక్షా కార్మికులు ఉండనే ఉండరు. పెద్ద పెద్ద గద్దల ఎజెండా ఉంటది. అదానీ అంబానీ లాంటి లక్షల కోట్ల శ్రీమంతులకు కార్పొరేట్ ట్యాక్స్‌లు రద్దు చేస్తరు తప్ప పేదవాళ్లకు మంచి చేయలేదు అని కేసీఆర్ మండిపడ్డారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే
### తాలిబన్ల రాజ్యం: ధర్మపురి



**జగిత్యాల:** కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే తాలిబన్ల రాజ్యం వస్తుందని బీజేపీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ హెచ్చరించారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. దేశభద్రత కోసం బీజేపీకి ఓటేయాలని కోరారు. కాంగ్రెస్ రజాకార్ల పార్టీ అని, హిందూ ధర్మాన్ని అవహేళన చేయడమే వారి విధానమని ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. శ్రీరాముల అక్షింతల పంపిణీపై సీఎం రేవంత్‌రెడ్డి రాద్ధాంతం చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ గెలిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను తీసివేసి మైనార్టీలకు ఇస్తారని తెలిపారు. గతంలో జీవన్‌రెడ్డి హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలతో కలిసి హిందూ ధర్మాన్ని కించపరిచి.. ఇప్పుడు హిందువుల ఓట్ల కోసం ప్రాధేయపడుతున్నాడని విమర్శించారు.


2 లో

## అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

# ఉమ్మడి పాలనకన్నా కెసిఆర్ ద్రోహమే ఎక్కువ

పాలమూరు ప్రాజెక్టులను పడావు పెట్టిన ఘనుడు
ఎంపిగా ఎన్నుకుంటే ద్రోహం చేసి పోయాడు
మోడీ అవినీతి పరులను పక్కన పెట్టుకుని నీతి వాక్యాలా
డికె అరుణ అవినీతి గురించి ప్రజలకు బాగా తెలుసు
షాద్‌నగర్ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు



**రంగారెడ్డి:** తెలంగాణను ఉమ్మడి పాలకుల కంటే కేసీఆర్ ఎక్కువ ద్రోహం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాజెక్టులు పూర్తి కాలేదు.. కెసిఆర్ పాలనలో కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. 2009లో పాలమూరు బిడ్డలు కేసీఆర్ ను గెలిపిస్తే.. పార్లమెంటుకు పోయిండు..తెలంగాణ వచ్చినంక ఛాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిండు.. ఉమ్మడి పాలకులకంటే కేసీఆర్.. తెలంగాణ ప్రజలకు ఎక్కువ ద్రోహం చేసిండని విమర్శించారు. అందుకే బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు ఎక్కడివి అక్కడే పూర్తి కాకుండా ఉన్నాయన్నారు. పాలమూరు వలస బిడ్డల బతుకు ల్లో ఏమాత్రం మార్పు రాలేదన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నేను ప్రజల ఆశీర్వాదంతోటి ముఖ్యమంత్రిని అయ్యా..తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యతను మీబిడ్డగా తీసుకున్నా అని ప్రజలనుద్దేశించి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేత డీ కే అరుణపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. డీకే అరుణను జెడ్పీటీసీ నుంచి మంత్రి స్థాయికి ఎదిగేలా చేసిందే కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఇయ్యాల డీకే అరుణను ప్రజలు గుర్తు పడుతున్నారంటే అది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ అన్నారు. నమ్మిన పార్టీని, మోసిన కార్యకర్తలకు అన్యాయం చేసి డీకే అరుణ శత్రువు పక్కన చేరిందన్నారు. కాంగ్రెస్ ను ఓడిస్తా.. రేవంత్ రెడ్డిని పడగొడ్తానని సవాల్ చేస్తుందన్నారు. 70 యేళ్ల తర్వాత పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే.. డీకే అరుణ బొడ్డు కత్తి పెట్టుకొని కాంగ్రెస్ పార్టీని ఓడిస్తా అంటే కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని అన్నారు. నేడు పాలమూరు జిల్లాలో పర్యటించిన మోదీ పాలమూరు - రంగారెడ్డికి జాతీయ హోదా గురించి మాట్లాడకపోవడం బాధాకరమని చెప్పారు.తాము అధికారంలోకి వచ్చి 100రోజుల్లో ఎలా దోచుకున్నామో మోదీ చెప్పాలని ప్రశ్నించారు.

# నగరంలో సంక్రాంతి సందడి

**హైదరాబాద్:** ఏపీలో ఈనెల 13న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్‌లో నివసించే ఏపీ వాసులంతా తమ స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. దీంతో నగరంలో సంక్రాంతి నాటి పరిస్థితుల కనిపిస్తున్నాయి. వరుసగా మూడు రోజులు సెలవులు కావడంతో నగరంలో ఉంటున్న వారు ఓటేసేందుకు సొంతూళ్లకు బయలుదేరారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం.. ఒక్క ఓటుతో తలరాతలు మారుతుంటాయి. అంతటి విలువైన ఓటును నిర్లక్ష్యం చేయవద్దంటున్నారు హైదరాబాద్‌లో స్థిరపడిన ఏపీ ఓటర్లు. జంట నగరాల నుంచి ఒకేసారి ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఓట్ల పండుగకు వెళ్తుండటంతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. అయినా.. రాష్ట్ర భవిష్యత్ కోసం ఎలాగైనా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. నిజాయతీ, విలువలు ఉన్న నాయకులకే పట్టం కడతామని చెబుతున్నారు. స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, రైళ్లను ఎంచుకుంటున్నారు. మరి కొందరు సొంత వాహనాల్లో వెళ్తున్నారు. దీంతో నగరమంతా దాదాపుగా ఖాళీ అవుతోంది. పది రోజుల నుంచే బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయ్యాయి. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఒంగోలు, గుంటూరు తదితర జిల్లాలకు వెళ్లే వారితో ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, సాగర్ రింగ్‌రోడ్డు బస్టాప్‌లలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీఎస్‌ఆర్టీసీ సుమారు 2 వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీనగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. శుక్ర, శని, ఆదివారాల్లో నడిచే 450 బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తయ్యాయి. ప్రయాణికుల రద్దీ మేరకు టీఎస్‌ఆర్టీసీ బస్సులు నడపనుంది.

## కట్టు కథలతో అల్లిన స్టోరీ ఢిల్లీ ఎక్సైజ్ కేస్

**హైదరాబాద్:** కేవలం ఊహాజనిత కట్టుకథలతో అల్లిన ఒక స్టోరీ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఏఎన్ఐ ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ అనేది ఢిల్లీ ప్రభుత్వ అంతర్గత వ్యవహారం. ఈ దేశంలో అనేక పాలసీలు మార్చారు. అదానీ కోసం బొగ్గు పాలసీ, విమానయాన పాలసీ మార్చిన విషయం వాస్తవం కాదా..? వాళ్ళ మీద ఏం చర్యలు తీసుకున్నారు అని కేటీఆర్ ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా ఢిల్లీ పాలసీ కేసు విచారణ చేస్తున్నా ఒక రూపాయి అయినా ఎక్కడైనా రికవరీ చేశారా..? కేవలం ఊహాజనిత కట్టుకథలతో అల్లిన ఒక స్టోరీ ఈ ఎక్సైజ్ పాలసీ కేసు. న్యాయ వ్యవస్థపై పూర్తిస్థాయి నమ్మకం ఉంది. మోడీ ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంది. బలమైన ప్రాంతీయ పార్టీ నాయకులు ఉండకూడదన్న లక్ష్యంతో ఈ రకంగా బీజేపీ వ్యవహరిస్తుంది. బీజేపీలో చేరిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని హైదరాబాద్ ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు చేయాల్సిన అన్ని పనులు పూర్తి చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు చాలా మంచి స్పందన వచ్చిందని... 14,000 మంది పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించారని వెల్లడించారు. గతంతో పోలిస్తే 6000 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. సాయంత్రంతో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ముగుస్తుందని చెప్పారు. హోమ్ ఓటింగ్ కూడా చాలా పక్కాగా జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందిని డీఆర్సీ సెంటర్లకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక బస్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలింగ్ స్టేషన్లో వద్ద ఉన్న క్యూ తెలుసుకోవడానికి పోల్ క్యూ ఆప్ చూసుకోవచ్చన్నారు. గూగుల్ మ్యాప్ ద్వారా పోలింగ్ స్టేషన్ దారి కనుక్కోవచ్చని చెప్పారు. వృద్ధులకు, వికలాంగులకు పికప్ అండ్ డ్రాప్ అవకాశం కలిపిస్తున్నామని.. ఇప్పటి వరకు 330 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంకా కావలసిన వాళ్లు సాక్ష్యం యాప్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. రూ.42 కోట్ల విలువైన వస్తువులు, లిక్కర్, డబ్బులు సీజర్ చేశామన్నారు. 3896 పోలింగ్ బూతుల్లో వెబ్ కాస్టింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ బూతు బయట సైడ్ కూడా సీసీ కెమెరాలు ఉంటాయన్నారు. మైక్రో అబ్జర్వర్ల కేటాయింపు రేపు జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు. సి విజిల్' ద్వారా వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కారం చేస్తున్నామన్నారు. 72 గంటల్లో మరింత పటిష్టంగా విజిలెన్స్ టీంలు పని చేస్తాయన్నారు. పౌరులు 50 వేల కంటే ఎక్కువగా నగదును క్యారీ చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. అవసరం ఉంటే సరైన పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. పొలిటికల్ పార్టీలో ఉన్నవారు రేపటితో పేపర్లో వివరాలు ప్రచురించాలన్నారు. ఎండాకాలం నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ ప్రతి పోలింగ్ స్టేషన్లో ఉంటుందన్నారు. ప్రచారం రేపు సాయంత్రం 6 గంటలకు ముగుస్తుందని... తర్వాత సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని తెలిపారు. నియోజకవర్గానికి చెందినవారు కాకుండా ఎవరూ అక్కడ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రకటనలు ఎన్నికల అధికారులతో అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే ప్రచురించాలని ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ స్పష్టం చేశారు.

# దేశం కోసం బిజెపి గెలవాల్సిందే



తీసుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. జూన్ 4 తర్వాత భారత విరోధులు పారిపోక తప్పదని హెచ్చరించారు. మధ్య తరగతి ప్రజల కలలను భారతీయ జనతా పార్టీ సర్కార్ నెరవేరుస్తోందన్నారు. గత పదేళ్లలో ఎన్నో సమస్యలకు ఎన్డీయే సర్కార్ పరిష్కారం చూపిందని మోదీ అన్నారు. డిజిటల్ రంగంలో, స్టార్టప్ సంస్థల్లో నేడు భారత్ సూపర్ పవర్ వంటి అనేక అంశాల్లో సాధించిన విజయాలే మోదీ ట్రాక్ రికార్డ్ అన్నారు. అయితే, దేశాన్ని లూటీ చేయడం, వారసత్వ రాజకీయాలు చేయడంలో దేశాన్ని విభజించి పాలించాలనేది కాంగ్రెస్ పార్టీ కుట్ర అని మోదీ విమర్శించారు. తెలంగాణకు ఉజ్వల భవిష్యత్ ఇచ్చేందుకు భాజపా కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. కాంగ్రెస్, భారాస, ఎంఐఎం వద్దని తెలంగాణ ప్రజలు నిర్ణయించు కున్నారని, భాజపాను గెలిపించుకోవాలని కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో నగరంలో ఎన్నోచోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి. వారి పాలనలో ఎక్కడికెళ్లాలన్నా భయపడాల్సి వచ్చేది. భారతీయుల పట్ల కాంగ్రెస్ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ రాకుమారుడి గురువు మనల్ని ఆఫ్రికన్లు అని మాట్లాడారు. దేశాన్ని విభజించి పాలించాలనేది ఆ పార్టీ కుట్ర. శ్రీరామనవమి జరుపుకోవడం కూడా తప్పే అన్నట్లు మాట్లాడుతున్నారు. శ్రీరాముడిని పూజించడం దేశ ద్రోహమా?

'అహింసో పరమోధర్మో అనేది ఇండియా సిద్దాంతం. వసుదైక కుటుంబం, బుద్ధం శరణం గచ్చామి.. ప్రజాసేవే భగవాన్ సేవ. నరుడే..నారాయణుడు అన్నదే భారత్ సిద్దాంతం. వేల సంవత్సరాల సంస్కృతి రక్షణ భారత్ అసలైన సిద్దాంతం అన్నారు. గత ప్రభుత్వం హైదరాబాద్ ముక్తి దివస్‌ను నిర్వహించలేదు. భాజపా ప్రభుత్వం సెప్టెంబర్ 17ని అధికారికంగా నిర్వహించింది. మతపరమైన రిజర్వేషన్లు ఉండకూడద నేది భాజపా సిద్ధాంతం. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి ఆర్ఆర్ ట్యాక్స్ మొదలైంది. కేంద్రం ఇచ్చిన నిధులను ఏటీఎంగా మార్చుకున్నారు. తాజాగా ఇక్కడ ఆర్ఆర్ఆర్ ట్యాక్స్ కూడా మొదలైంది. మూడో ఆర్ అంటే.. రజాకార్ ట్యాక్స్. తెలంగాణకు ఏమీ ఇవ్వలేదని కాంగ్రెస్ అంటోంది. రాష్ట్రానికి 4 వందేభారత్ రైళ్లు ఇచ్చిందెవరు? తొలి ఎయిమ్స్ ఇచ్చిందెవరు? ఫెర్టిలైజర్స్ పరిశ్రమ ఇచ్చిందెవరు? పసుపు బోర్డు ఇచ్చిందెవరు? గిరిజన విశ్వవిద్యాలయం ఇచ్చిందెవరు?' అని మోదీ ప్రశ్నించారు. ఎప్పుడూ ఫారిన్ లెన్స్‌తో భారతదేశాన్ని చూసే కాంగ్రెస్‌కు భారతదేశం అనే ఆలోచన లేదన్నారు. ఏది ఏమైనప్పటికీ?భారతదేశం ఆలోచన ఏంటో ఒక్కటిగా వివరించారు ప్రధాని నరేంద్ర మోదీ. సత్యమేవ జయతే భారతదేశం ఆలోచన.. అహింస అత్యున్నత మతం. భారతదేశం ఆలోచన అంటే ఆచరః పర్మో ధర్మః. భారతదేశం ఆలోచన అంటే? అహింసో పరమ ధర్మం: ఐడియా ఆఫ్ ఇండియా అంటే ఏకం సత్ విప్రా, బహుధా వదంతి ఐడియా ఆఫ్ ఇండియా అంటే వసుదైక కుటుంబం. భారతదేశం ఆలోచన అంటే సర్వ పంత్ సమానత్వం ఐడియా ఆఫ్ ఇండియా అంటే ఆప్ దీపో భవ ఐడియా ఆఫ్ ఇండియా అంటే బుద్ధం శరణం గచ్ఛామి భారతదేశ ఆలోచన అంటే సర్వే భద్రాణి పశ్యన్తు, మా కశ్చిద్ దుఃఖ్ భాగ్ భవేత్ భారతదేశం ఆలోచన? దాతృత్వ సాతాన్ విభూతే: భారతదేశం ఆలోచన: మానవ సేవయే.. మానవ సేవ భారతదేశం ఆలోచన అంటే ఈశ్వర్: సర్వభూతానన్ ఐడియా ఆఫ్ ఇండియా అంటే అన్ని వెలుగుల మధ్య సమానత్వం. భారతదేశం ఆలోచన? దేవుడు గొప్పవాడు భారతదేశం ఆలోచన.. మనిషిలో నారాయణుడు, జీవిలో శివుడు! భారతదేశం ఆలోచన ? దేవి సర్వభూతేషు మాత్రి లాంటి సంస్థ. ఐడియా ఆఫ్ ఇండియా?మా విద్విషవహై. ఐడియా ఆఫ్ ఇండియా? మిచ్ఛామి దుక్కడం. భారతదేశం ఆలోచన.. లక్ష్మణుడికి తన బంగారు లంకపై ఆసక్తి ఉండేది. తల్లి జన్మస్థలం, స్వర్గం, స్వర్గం, పేదరికం, జనని జన్మ భూమిచ్చా.. స్వర్గాధపి, ధరియసి, అందుకే ఈ భూమి.. నాకు స్వర్గం కంటే ప్రియమైనది అంటూ రాముడు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ..ప్రధాని మోదీ ఎమోషనల్ ప్రసంగం చేశారు. అంతేకాదు, ఇవి శ్రీరాముడి మాటలు మాత్రమే కాదు, ఈ రోజు భారతదేశం ఈ ఆలోచన కేవలం నమ్మకాలకే పరిమితం కాలేదు. ఈ భారతదేశపు ఆలోచనే నేటి భారతదేశానికి గుర్తింపు అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ భారతదేశం ఆలోచన నేడు భారతదేశం వాయిస్ అన్నారు. మరి అందుకే ఈరోజు ఐడియా ఆఫ్ ఇండియా అంటే అంతర్జాతీయ యోగా దినోత్సవం. భారతదేశం ఆలోచన అంటే ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు. భారతదేశం ఆలోచన అంటే ప్రపంచానికి ఒక సూర్యుడు ఒక భూమి ఒక గ్రిడ్ ఆలోచన, ఐడియా ఆఫ్ ఇండియా అంటే చంద్రునిపై శివశక్తి పాయింట్, ఐడియా ఆఫ్ ఇండియా మదర్ ఆఫ్ డెమోక్రసీ, భారతదేశం ఆలోచన అంటే.. అందరికీ న్యాయం, ఎవరికీ శాంతి భద్రతలు, భారతదేశం ఆలోచనకు వ్యతిరేకంగా మనకు ఈ ప్రేరణ లభించిన శ్రీరాముని ఆరాధనను వద్దంటుంది. అంతేకాదు, అటు బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్‌లాగే.. కాంగ్రెస్ కూడా తెలంగాణను లూటీ చేస్తోందన్నారు ప్రధాని మోదీ. కాంగ్రెస్ హామీలు మరిచి.. ఫేక్ వీడియోల దుకాణం తెరిచిందని విమర్శించారు. ఆర్ఆర్ ట్యాక్స్‌పై ఢిల్లీలో సైతం చర్చ జరుగుతుందన్నారు. వీటన్నింటికి సమాధానం చెప్పే సమయం దగ్గరకు వచ్చిందన్నారు. వారసత్వ రాజకీయాలే కాంగ్రెస్ ట్రాక్ రికార్డ్. గతంలో బాంబు పేళుళు జరిగేవి.. ఇప్పుడు జరుగుతున్నాయా? అన్ని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఢిల్లీలో బలమైన ప్రభుత్వం వచ్చే పేళ్లు ఆగిపోయాయి. కాంగ్రెస్‌కు ఓటు వేయడమంటే మళ్లీ పాత రోజులను ఆహ్వానించడమే అన్నారు. మీ సంపదను లాక్కునేవారు కావాలా? సంపదను పెంచేవారు కావాలా? తేల్చుకోవాలని మోదీ సూచించారు. ఈ సభా వేదికపై కిషన్ రెడ్డి, లక్ష్మణ్, ఈటెల రాజేందర్, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలను ఆదుకున్న ఘనత మాదే

**రాజన్న సిరిసిల్ల,:** బీజేపీ ఎజెండాలో పేదలు లేరు కానీ పెద్ద పెద్ద గద్దలు ఉన్నారని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు చేసిందేమీ లేదని కేసీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా.. దేవుని పేరు కూడా ఉండాలని వేములవాడ రాజన్న పేరును సిరిసిల్ల జిల్లాకు పెట్టుకున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో మూడు పార్టీలు రంగంలో ఉన్నాయి. ఏ పార్టీలు ఏం చేశాయో మీకు అందరికీ బాగా తెలుసు. నిన్న ఈ వేములవాడకు ప్రధాని మోదీ వచ్చారు. ఆయన పక్కనే బండి సంజయ్ ఉన్నాడు. దేశం కోసం ధర్మం కోసం అని మాట్లాడే ప్రధాని మోదీ, హిందూ హిందూ అని మాట్లాడే బండి సంజయ్ వేములవాడకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. వేములవాడ దేవస్థానాన్ని బాగు చేస్తామని చెప్పారా..? అది కూడా లేదు. ఇరుకుగా ప్లేస్ ఉందని చెప్పి నేను అక్కడొచ్చి 35 ఎకరాలు ఇప్పించి అభివృద్ధి చేసే ప్రయత్నం చేశాను. బండి సంజయ్ రూపాయి అడగలేదు.. మోదీ ఇవ్వలేదు అని కేసీఆర్ మండిపడ్డారు. ఇది చేనేతలు ఎక్కువగా నివసించే ప్రాంతం. గతంలో చేనేతల ఆత్మహత్యలు జరిగితే కన్నీళ్లు పెట్టుకున్నా.. బాధపడ్డాను. అనేక స్కీమ్స్ తెచ్చి బతుకమ్మ చీరలు, స్కూల్ డ్రస్సులు, క్రిస్మస్, రంజాన్ కానుకలు ఆర్డర్లుగా ఇచ్చి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాం. రూ. 372 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇవ్వమని అడిగితే నిరోధ్‌లు, పాపడలు అమ్ముకోండని కాంగ్రెస్ నేతలు అంటే కోపం వచ్చి ఒక మాట అన్నాను. దాంతో నా మీద 48 గంటల నిషేధం పెట్టారు. చేనేత, పద్మశాలిలను అవమానించారని మాట్లాడితే నిషేధం పెట్టారు. దేశంలో తొలిసారి చేనేత మీద జీఎస్టీ వేసిన మొదటి ప్రధాని మోదీ. ఏ ప్రధాని కూడా చేనేతపై జీఎస్టీ విధించలేదు. కానీ మోదీ విధించారు. చేనేతలకు ఉన్న ఇన్సూరెన్స్‌తో పాటు అన్ని స్కీమ్స్ రద్దు చేశారు మోదీ. చేనేత కార్మికులంటే లెక్కనే లేదు. బీజేపీ ఎజెండాలో పేదలు, కార్మికులు, రైతులు, ఆటో రిక్షా కార్మికులు ఉండనే ఉండరు. పెద్ద పెద్ద గద్దల ఎజెండా ఉంటది. అదానీ అంబానీ లాంటి లక్షల కోట్ల శ్రీమంతులకు కార్పొరేట్ ట్యాక్స్‌లు రద్దు చేస్తరు తప్ప పేదవాళ్లకు మంచి చేయలేదు అని కేసీఆర్ మండిపడ్డారు. 2014లో నేను ప్రధానిగా గెలిచిన తర్వాత 15 లక్షలు ఇస్తానని చెప్పాడు. 15 లక్షలు కాదు.. పదిహేను రూపాయలు కూడా రాలేదు. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ రాలేదు. అచ్చేదిన్ రాలేదు. బేటీ పడావో బేటి బచావో వచ్చిందా..? జన్ ధన్ ఖాతా ఏమైనా జరిగిందా?? డబ్బాలో రాళ్లు వేసి ఊపినట్టే కానీ ఏం జరగలేదు. ఎవరికి కూడా న్యాయం జరగలేదు. గొల్లకుర్మలకు గొర్రెలు ఇస్తుంటే అడ్డు పడ్డరు. మోదీ గెలిస్తే పెట్రోల్, డిజీల్ ధర 400 దాటుతది. మోసపోతే గోసపడుతాం.. జాగ్రత్త అని మనవి చేస్తున్నా అని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రచారంలో వినోద్ కుమార్, కెటిఆర్ పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

### కళ్యాణలక్ష్మి చెక్కు బౌన్స్..తులం బంగారం తుస్

### హుస్నాబాద్ ప్రచారంలో హరీష్ రావు విమర్శలు

**హుస్నాబాద్:** కాంగ్రెస్ నేతలు అన్నివర్గాల ప్రజలను మోసం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారని, 5 నెలలవుతున్నా దిక్కులేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం రివర్స్ గేర్‌లో నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ నిరంతరం ఉండేదని, ఇప్పుడు నిత్యం సరఫరా నిలిచిపోతున్నదన్నారు. రైతులు, నిరుద్యోగులను ఈ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు.కల్యాణ లక్ష్మి చెక్కు బౌన్స్ అయింది.. తులం బంగారం తుస్సుమన్నదని చెప్పారు. పెండ్లి చేసుకున్న వాళ్లకు తులం బంగారం ఇస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. పైగా కాంగ్రెస్ వచ్చాక బంగారం ధరలు కొండెక్కాయని, కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ నిలిచిపోయిందని చెప్పారు. కేసీఆర్ కిట్లు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రియాంక గాంధీ గతంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి హుస్నాబాద్‌కు వచ్చినప్పుడు తాము గెలిస్తే ఇక్కడ మెడికల్ కాలేజీ ఇస్తామని చెప్పారని గుర్తించారు. ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. మహిళల ఖాతాల్లో రూ.2500 జమ చేశామని రాహుల్ గాంధీ చెప్పారని, ఆయన అబద్దాల గాంధీగా మారారని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రూ.15 వేల రైతుబంధు, ధాన్యానికి రూ.500 బోనస్ రాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన రాహుల్ గాంధీ మీటింగ్ తుస్ మన్నది. 30 వేల కుర్చీలు వేసి కూలర్లు పెడితే పట్టుమని 3 వేల మంది కూడా రాలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రోడ్డు మీదకి పోయి లోపలకు రండని బ్రతిమిలాడిన ఎవరూ వస్తలేరని చెప్పారు.

# కేసీఆర్ మెడలు వంచింది నేనే..

### ప్రభుత్వాన్ని గద్దె దించింది నేనే..

### కేసీఆర్ కంటే కేటీఆర్ దాదాగిరే ఎక్కువ

### బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: కేసీఆర్ పై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు నీ గడీలు బద్దలు కొట్టిం..నీ మెడలు వంచి..నీ ప్రభుత్వాన్ని గద్దె దించి.. నిన్ను ఫామ్ హౌస్ నుంచి గుంజుకొచ్చి ధర్నా చౌక్ వద్ద నిలబెట్టింది నేనే అంటూ కేసీఆర్ పై కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హిందూ ధర్మం మీద కసితో.. హిందువులు అంటే కోపంతో ఉన్నావ్.. అంతేకాదు హిందూ దేవుళ్లంటే భయంతో ఉన్నావని కేసీఆర్‌పై తీవ్రంగా మండిపడ్డారు. అయితే నిన్న కరీంనగర్‌లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో బండి సంజయ్ ఇవాళ మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు గాను తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే.. కేసీఆర్ మతం గురించి మాట్లాడితే సెక్యులర్%ొ% మేం మాట్లాడితే మతతత్వమా? అని ప్రశ్నించారు. అంతేకాకుండా.. కేసీఆర్ నిన్న కరీంనగర్‌కు వచ్చి 80 శాతం ఉన్న హిందువుల గురించి మాట్లాడకుండా, 20 శాతం ఉన్న ముస్లింలను ఒక్కటి కావాలని పిలుపునిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ మాట్లాడుతూ.. హిందుగాళ్లు%ొ% బొందుగాళ్లు అన్న ఆయనకు కరీంనగర్ ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. ఇక ఇప్పుడు మరోసారి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కాగా.. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆయన పెట్టిన పోలీస్ వలయాన్ని చేధించుకొని హైదరాబాద్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు వెళ్లి జైశ్రీరామ్ అని గర్జించిన వ్యక్తిని తానే అన్నారు. సూటిగా చెబుతున్నానని, హిందువుల కోసం పని చేస్తానని,



కరీంనగర్ అభివృద్ధి కోసం పని చేస్తానని, మోడీ బాటలో పయనిస్తానని తెలిపారు. దీంతో.. కరీంనగర్‌కు వచ్చిన కేసీఆర్ ఓ వర్గం ఓట్లను ఏకం కావాలని చెబుతున్నారని%ొ% ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి ఓడిపోతే ఆ మతం పుచ్చుకొని రాజకీయాల నుంచి తప్పుకుంటావా? అని సవాల్ చేశారు. కేసీఆర్ హిందూ ధర్మాన్ని హేళన చేసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని అందరూ గుర్తించాలన్నారు. ఇక హిందువులంతా ఒక్కటైతే ఎలాంటి గుణపాఠం ఉంటుందో నిరూపించుదామన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. బండి సంజయ్ హిందువుల గురించి, హిందూ సమాజం గురించి మాట్లాడుతున్నారని, మీ కోసం కొట్లాడే వ్యక్తిని తాను మాత్రమే అని బీఆర్ఎస్ కార్యకర్తలారా.. అన్నారు. కేసీఆర్ కరీంనగర్‌కు వచ్చి తమాషాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. నిన్న కేటీఆర్ భైంసాకు వెళితే హనుమాన్ భక్తులు నిలదీశారని గుర్తు చేశారు. ముస్లింలు కూడా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారన్నారు. కాగా.. మేం ధర్మం కోసం, అభివృద్ధి కోసం రాజకీయం చేస్తామన్నారు.

# ఆగస్టు 15 కల్లా, రైతు రుణమాఫీ

### మార్కెటింగ్ వ్యవస్థలో దళారుల పాత్రని

### ఏ మాత్రం ఉపేక్షించం

### మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**హైదరాబాద్:** రైతు సర్వతోముఖాభివృద్ధికి ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఆగస్టు 15 కల్లా, రైతు రుణమాఫీ అమలుచేసి తీరుతామని ఇప్పటికే మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు, మేము ప్రకటించిన విషయం విదితమే. తిరిగి రైతు ఈ అప్పుల ఊబిలో పడిపోకుండా మా ప్రభుత్వము రైతాంగ సంక్షేమం కోసం ఇతర పథకాల అమలుకు ప్రణాళిక చేస్తుందన్నారు. ముఖ్యంగా పంటనష్టపోయిన సందర్భాలలో రైతులను ఆదుకునే విధంగా పంటభీమా, ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి ఈ వానాకాలం నుండి అమలు చేస్తున్నదని ఆయన వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి ప్రతి ఒక్కరికి రుణసహాయం అందేలా, వడ్డీవ్యాపారస్థులపై ఆధారపడకుండా చేసేందుకు పటిష్ట ప్రణాళికలను రూపొందిస్తున్నామని, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి, సకాలంలో ఎరువులు అందేలా చేస్తాము. కేంద్రప్రభుత్వం కొన్నా, కొనకపోయినా ప్రతిపంటను రైతుకు గిట్టుబాటు ధర అందేలా చర్యలు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా.. 'తెలంగాణ భౌగోళిక పరిస్థితులకు అనుకూలంగా ఉండి, రైతులకు అధిక ఆదాయము సమకూర్చే పంటల ఎంపిక దిశగా రైతులను ప్రొత్సహిస్తాము. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత యూనివర్సిటిలకు, శాఖలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటించిన కేంద్రప్రభుత్వం గడిచిన



పదేళ్ళ కాలంలో రైతుల నికరఆదాయాన్ని పెంచే ఏ ఒక్క పథకాన్ని తీసుకురాలేకపోయింది. కనీసం రైతు రుణమాఫీ చేసే రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా కనీస తోడ్పాటు అందిస్తామన్న చిన్న ప్రకటన కూడా చేయడానికి బిజెపి పెద్దలు సంశయిస్తున్నారంటే, రైతాంగ సంక్షేమం పట్ల వాళ్ళకి ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుంది. వారికి పెట్టుబడిదారుల, సంపన్నుల రుణాలు మాఫీ చేయడంలో ఉన్న ప్రత్యేక శ్రద్ధ, పేద రైతాంగం పట్ల లేదు. మిగులు బడ్జెట్ తో ఏర్పాటైన, తెలంగాణ రాష్ట్రంను, తమ అసమర్ధ విధానలతో, అప్పుల ఊబిలోకి నెట్టిన, ఆర్థిక వ్యవస్థను దివాళాతీయించిన %దీ=ా% నాయకులకు కూడా ఒకటే చెప్తున్నాం. ప్రత్యేక ఆర్థిక క్రమశిక్షణతో, ఈ ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తుంది. ఈ ప్రభుత్వానికి మీలాగా కల్లబొల్లి కబుర్లు, ఎన్నికలకోసమే కొన్ని ప్రాంతాలకే పథకాలు అమలు చేయడం వంటివి తెలియవు. తెలంగాణ ప్రజలు అత్యాశకు పోయి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారు అని వ్యాఖ్యానించడంలోనే తెలస్తుంది %దీ=ా% పెద్దలకు తెలంగాణ ప్రజల పట్ల వారి తీర్పు పట్ల ఎంత చులకనభావం ఉందో. వారికి అధికార మత్తు ఇంకా వదల్లేదని, దానిని పూర్తిగా ఈ లోక్ సభ ఎన్నికల్లో వదలగొట్టడానికి అదేవిధంగా రైతాంగ సమస్యల పట్ల బిజెపి వాళ్ళ ఉదాసీన వైఖరిని ఎండగట్టె విధంగా తీర్పు ఇవ్వడానికి తెలంగాణ ప్రజలు ముఖ్యంగా రైతులు సిద్ధంగా ఉన్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి.

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మే 10

పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. ఈ నెల 13న జరుగనున్న పోలింగ్ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవీఎం యంత్రాల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఇటీవలే శాసన సభ ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని సీఈఓ ప్రస్తావిస్తూ, ప్రస్తుత పార్లమెంటు ఎన్నికలను మరింత మెరుగైన రీతిలో పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పోస్టల్ బ్యాలెట్ లను వేరు చేస్తూ, సంబంధిత సెగ్మెంట్లకు పంపించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలన్నారు. ఒకవేళ వర్షాలు కురిసినా ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రి తడిసిపోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో టెంట్లు, విద్యుత్ వసతి, తాగు నీరు, టాయిలెట్, ఫ్యాన్లు, అందుబాటులో ఉన్న చోట కూలర్లు వంటి వసతులను కల్పించాలన్నారు. పోలింగ్ కు మరికొద్ది గంటల వ్యవధి మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో నగదు, మద్యం, విలువైన వస్తువుల పంపిణీ వంటి వాటిపై గట్టి నిఘా పెట్టాలని, ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని సూచించారు. ముఖ్యంగా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయించాలన్నారు. మాక్ పోల్, పోలింగ్ ప్రక్రియల సందర్భంగా ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే, ఈ.సీ మార్గదర్శకాలను పాటించాలని అన్నారు.






**మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు.**

**ఈవీఎంల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు.**

**కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సీఈఓ.**

ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ముగ్గురు చొప్పున ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని, సెక్టోరల్ అధికారులు వారిని సంప్రదించేలా చూడాలన్నారు. నిర్దేశిత సమయానికి పోలింగ్ ప్రారంభం అయ్యేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. ఎక్కడ కూడా రీపోలింగ్ కు ఆస్కారం లేకుండా నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ ప్రక్రియ కొనసాగాలని సూచించారు. పోలింగ్ అనంతరం పోలింగ్ కేంద్రాల నుంచి కౌంటింగ్ కేంద్రం స్ట్రాంగ్ రూమ్ కు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలని, పోలీసు బందోబస్తు మధ్యన వాటిని తరలించాలని, సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. పోలింగ్ సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, మాక్ పోల్ నిర్వహించాలని, పోలింగ్ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించాలని, అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉన్న పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిర్వహించాలని, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ఈ.సీ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మహిళలు, యువత, దివ్యాంగులను పోలింగ్ లో భాగస్వామ్యం చేసేలా, ఆ సందేశం స్పష్టంగా తెలిసేలా మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సదుపాయాలను సరిచూసుకోవాలని అన్నారు. సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# క్రీడల్లో మెలుకువలు నేర్చుకోవాలి.

**- సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్.**

వేగుచుక్క న్యూస్, సిరికొండ, మే 10:



విద్యార్థులు క్రీడా మెలుకువలు నేర్చుకొని, నైపుణ్యం కల్గిన క్రీడకారులుగా తయారు కావాలని జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ అన్నారు. శుక్రవారం జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సత్యశోధక్ పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వేసవి బేస్ బాల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన గంగామోహన్, బేస్ బాల్ జిల్లా కోచ్ హెచ్. అనికేత్ సందర్శించారు. ఈ సందర్భంగా గంగామోహన్ మాట్లాడుతూ, విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, బేస్ బాల్ లో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ రీజినల్ ఛాంపియన్లుగా నిలవడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో నైపుణ్యాలను మెరుగు పరుచుకొని అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావాలని అన్నారు. జిల్లా కోచ్ హెచ్. అనికేత్ విద్యార్థులకు బేస్ బాల్ భౌతిక, సాంకేతిక నైపుణ్యాలను తెలియపరిచారు. జిల్లా కోచ్ హెచ్. అనికేత్ ను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య, పీఈటీలు అనిల్ సంతోష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రూ. 150తో హైదరాబాద్‌కు వచ్చా..

**ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగా**

**మీ అందరి సహకారం వల్లే ఇవి సాధ్యమయ్యాయి**

**ఇంకో పదేళ్లపాటు అధికారంలో ఉంచేందుకు శ్రమిస్తా**

**కేసీఆర్ ను ఓడించిన వ్యక్తిగా నా పేరు చరిత్రలో శాశ్వతం**

**ఓ ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీని తెలంగాణలో ఇంకో పదేళ్లపాటు అధికారంలో ఉంచేందుకు నిరంతరం శ్రమిస్తా అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "నేను కేవలం ఒక్కడినే రూ. 150 తో నా సొంత ఊరు కొండారెడ్డిపల్లి నుంచి హైదరాబాద్ కు వచ్చా.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగా. ఇండిపెండెంట్ జెడ్పీటీసీగా నేను గెలిచినప్పుడు ఎవరైనా ఊహించారా నేను జెడ్పీటీసీని అవుతానని?. వీటన్నిటికీ కారణం శ్రమ, పట్టుదల, ప్రకృతి అనుకూలించడం, మీ అందరి సహకారం వల్లే సాధ్యమయ్యాయి. చరిత్ర ఎంత కాలముంటదో.. ఈ రాష్ట్ర మనుగడ ఎంత కాలముంటదో అంతకాలం నా పేరు గుర్తుంటది.. తెలంగాణ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, అలాగే కేసీఆర్ ను ఓడించిన వ్యక్తిగా నా పేరు చరిత్రలో శాశ్వతంగా ఉంటుంది. వచ్చే పది సంవత్సరాల పాటు రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తా%శొ% నిరంతరం పరితపిస్తూనే ఉంటా.. అది నా బాధ్యత. భవిష్యత్ లో కూడా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం కృషి చేస్తా. పార్టీలో ప్రతి ఒక్కరినీ కలుపుకుంటూ ముందుకెళ్తా. పార్టీ కూడా కష్టపడ్డవారిని గుర్తిస్తుంది" అని ఆయన అన్నారు. పార్టీని అధికారంలోకి తీసుకరావడంలో కీలక పాత్ర పోషించాను కాబట్టే పార్టీ నాకు ఈ అవకాశం ఇచ్చింది' అంటూ ఆయన పేర్కొన్నారు. "నేను ఏ పని చేసినా చిత్తశుద్ధితో, ఏకాగ్రతతో పని చేస్తా.. ఎట్టి పరిస్థితుల్లో కూడా 'ఏ.. అయితే అయ్యింది లేకపోతే లేదు' అన్నట్టుగా ఎప్పుడూ కూడా ఆలోచించను.. నేను ఏది చేసినా ఎక్కువ ఫోకస్ పెట్టి పని చేస్తా.. అందుకే తక్కువ కాలంలో నాకు ఎక్కువ అవకాశాలు వచ్చాయి" అని ఆయన అన్నారు. ఈ రాష్ట్రానికి వంద సంవత్సరాలకు అవసరమయ్యే అభివృద్ధి ప్రణాళికను ఆల్రెడీ డిజైన్ చేశాను.. ఆ దిశగా ముందుకెళ్తూ అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కూడా అత్యధిక సీట్లు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. సాధారణ వ్యక్తి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి తాను ఎదిగిన విధానం, అదేవిధంగా ఒక ముఖ్యమంత్రిగా తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనేదానిపై తనకు ఉన్న ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళికలను, ఆ దిశగా వేస్తున్న అడుగుల విషయమై ఆ ఇంటర్వ్యూలో సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సిరిసిల్ల జిల్లాగా ఉండాలంటే వినోద్ గెలవాలి

**రాజన్న సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఉండాలంటే కరీంనగర్ పార్లమెంటు పరిధిలో వినోద్‌కుమార్ గెలవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. రేపు జిల్లా తీసేస్తా అంటే.. అడ్డం పడి కొట్లాడేటోడు.. యుద్ధం చేసేటోడు కావాలని తెలిపారు. మీరు నాకు బలమిస్తే.. సిరిసిల్ల జిల్లాను కాపాడే బాధ్యత నాది అని కేసీఆర్ పేర్కొన్నారు. సిరిసిల్ల జిల్లాను కాపాడుకునేందుకు ఎంతకైనా ఉద్యమం చేద్దామని స్పష్టంచేశారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర శుక్రవారం నాడు కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని సిరిసిల్ల పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా సిరిసిల్ల పాత బస్టాండ్ దగ్గర కార్నర్ మీటింగ్‌లో కేసీఆర్ మాట్లాడుతూ.. సిరిసిల్ల జిల్లా కాపాడుకోవాలన్నా.. గోదావరి జలాలను కాపాడుకోవాలన్నా.. మన నేత కార్మికుల బతుకులు బాగుండాలన్నా.. ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకనాడు చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. బాధపట్టలేక పార్టీ నుంచి 50 లక్షలు తెచ్చి ట్రస్ట్ ఏర్పాటు చేశానని కేసీఆర్ గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కేటీఆర్ ఆధ్వర్యంలో అనేక స్కీమ్‌లు పెట్టుకున్నామని తెలిపారు. ' సిరిసిల్లకు ఒక టెక్స్‌టైల్ పార్క్ కావాలంటే నరేంద్ర మోదీ ఇవ్వలేదు.. అయినా సరే రాష్ట్రం చేతిలో ఉన్నంతలో బతుకమ్మ చీరలు, రంజాన్ గిఫ్ట్‌లు, స్కూల్ యూనిఫాం కాంట్రాక్టులు ఇచ్చి కాపాడుకున్నాం. కనీసం నెలకు 15వేలు, 20వేలు జీతం వచ్చే పరిస్థితి తెచ్చుకున్నాం. కానీ ఈనాడు వచ్చిన ఈ సర్కార్ అన్నింటిని బంద్ పెడతుంది.' అని తెలిపారు. పాత బకాయిలు ఇవ్వడం లేదని.. కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా రంజాన్ తోఫా అందలేదని చెబుతున్నారని అన్నారు. పేదలకు బట్టలు దొరుకుతాయని, చేనేత కార్మికులకు పని దొరుకుతుందని ఈ కార్యక్రమాన్ని పెట్టామని తెలిపారు. దాన్ని ఈ సర్కార్ ఎందుకు బంద్ పెట్టిందనేది ఆలోచించాలని సూచించారు. గుడ్డిగా ఓట్లు వేయడం కాదు.. ఎవరో చెబితే ఓట్లు వేయడం కాదు.. మన బతుకేంది.. మన ఆగమేందనేది ఆలోచన చేయాలని సూచించారు. రైతుబంధు ఇవ్వడానికే వెనుకాడిన ఈ ప్రభుత్వం ధాన్యం కూడా కొంటలేదని కేసీఆర్ అన్నారు. కల్లాల్లో ధాన్యం తడిసి పోతుందన్నారు. వడ్లు తడిసిపోతుంటే కొనే దిక్కులేదని చెప్పారు. అందుకే ఆవేశంతో కాకుండా ఆలోచించి పార్లమెంటులో మనతో కొట్లాడే వ్యక్తి వినోద్‌కుమార్‌కు ఓటేయాలని సూచించారు. వినోద్‌తో పాటు చాలామంది గెలవబోతున్నారని కేసీఆర్ తెలిపారు. ఎంపీ సీట్లలో మనదే మెజారిటీ అని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో నెంబర్‌వన్ మెజారిటీ ఇచ్చి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని అన్నారు.



ఆనాడు తెలంగాణను కాంగ్రెస్ అవమానిస్తే ఎంపీ పదవికి రాజీనామా చేశానని.. అప్పుడు మీరే 2.5 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపించి తెలంగాణ ఉద్యమ గౌరవాన్ని పెంచారని గుర్తు చేశారు. మళ్లీ ఈ కీలక సమయంలో ఈ కరీంనగర్ గడ్డ.. తెలంగాణ గౌరవాన్ని కాపాడాలని.. గులాబీ జెండా గౌరవాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. బ్రహ్మాండమైన మెజార్టీతో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సిరిసిల్ల జిల్లా ఉండాలంటే ఇక్కడ వినోద్‌కుమార్ గెలవాలని స్పష్టం చేశారు. బండి సంజయ్‌కు వినోద్‌కుమార్‌కు ఏదైనా పోలిక ఉందా.. ఆయన మాట్లాడితే ఏమైనా అర్థం అవుతుందా అనికేసీఆర్ ప్రశ్నించారు. బండి సంజయ్ మాట్లాడేది ఏం భాషా.. హిందీనా? ఇంగ్లీషా? తెలుగా? అని ఎద్దేవా చేశారు. కరీంనగర్ పార్లమెంటు కోసం వినోద్‌కుమార్ అనేక కార్యక్రమాలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. పార్లమెంటులో కొట్లాడారని తెలిపారు. తెలంగాణ సాధన కోసం 2001 నుంచి తనతో పాటు ఉన్నారని పేర్కొన్నారు. కమ్యూనిస్టు కుటుంబం నుంచి అరచేతిలో వైకుంఠం చూపించి.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేసీఆర్ అన్నారు. మహిళలకు రూ.2500, రైతులకు 2 లక్షల రుణమాఫీ.. ఇలా ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. ఒకే ఒక్క మహిళలకు ఉచిత బస్సు స్కీమ్ పెట్టారు.. దాంతో బస్సుల్లో ఆడవాళ్లు సర్కాస్ చేసినట్టు తన్నుకుంటున్నారని. ఆటో డ్రైవర్లు అన్నమో రామచంద్రా అని ఏడుస్తున్నారని తెలిపారు. మొత్తం రైతాంగాన్ని కాంగ్రెస్ వంచించిందని కేసీఆర్ అన్నారు. రైతుబంధు రాలేదు.. నీళ్లు రాలేదు.. కరెంటు రాలేదు.. మరమగ్గాలు మూలపడే పరిస్థితి, చేనేత కార్మికులు చచ్చిపోయే పరిస్థితి.. ఇలా ఎవర్నీ ఆదుకున్న పరిస్థితి లేదని మండిపడ్డారు. ఆరు గ్యారంటీల్లో కాంగ్రెస్ ఏదీ అమలు చేయలేదని తెలిపారు. అందుకే అందరూ కూడా ఆలోచించి ఓటేయాలి తప్ప ఆగమాగం వేయొద్దని సూచించారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు, పెద్దింటి అశోక్ వంటి రచయితలు, మేధావులు అందరూ ఆలోచించి ఓటేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా.. మళ్లీ ఓట్లు అడుగుతున్నారని కేసీఆర్ అన్నారు. ఇప్పుడు మళ్లీ వాళ్లకే ఓటేస్తే.. ఇష్టమొచ్చిన మాటలు చెప్పి ఏం చేయకున్నా మాకే ఓటేసింద్రు.. అని మొత్తం బంద్ చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇవాళ నరేంద్ర మోదీ వచ్చి గోదావరిని ఎత్తుకుని వెళ్తా అంటున్నాడని కేసీఆర్ తెలిపారు. గోదావరి నుంచి నీళ్లు తెచ్చి మానేరు నదిని సజీవ నదిగా చేసుకున్నామని.. దీంతో మిడ్ మానేరు కళకళలాడుతుండేదని.. కానీ ఇప్పుడు దాన్ని మొత్తం ఎండబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నది పోతే తెలంగాణకు నీళ్లు ఎలా రావాలి? మనం ఏవిధంగా బతకాలనేది ఆలోచించాలని ప్రజలకు సూచించారు. ఏం చేయకున్నా గాలి గత్తర ఓటేస్తేమంటే.. మన బతుకులు కూడా గావరగావర అవుతాయి తప్ప లాభం జరగదన్నారు. అందుకని వెర్రి ఆవేశం కాదు.. నినాదాలు చెప్పడం కాదు.. మంచిగా ఆలోచించి.. చర్చించి ఓటేయాలని కోరారు.

# తెలంగాణ ఈసెట్ ప్రాథమిక ఆన్సర్ 'కీ' విడుదల

**హైదరాబాద్:** తెలంగాణ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఈసెట్)-2024 ప్రాథమిక ఆన్సర్ 'కీ' విడుదలైంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ నుంచి ప్రిలిమినరీ ఆన్సర్ 'కీ' డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆన్సర్ కీతో పాటు రెస్పాన్స్ షీట్, మాస్టర్ ప్రశ్నపత్రాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆన్సర్ కీపై అభ్యంతరాలకు మే 12వ తేదీని తుది గడువుగా నిర్ణయించారు. అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో మాత్రమే తెలియజేయాలి. తెలంగాణ ఈసెట్‌లో వచ్చిన ర్యాంకు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో సెకండ్ ఇయర్‌లో డైరెక్ట్‌గా ప్రవేశాలు కల్పిస్తారు. కాగా ఈ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా మే 6వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన విషయం తెలిసిందే. అభ్యంతరాల స్వీకరణ అనంతరం త్వరలోనే ఫలితాలను కూడా వెల్లడించనున్నారు.యూపీఎస్సీ నిర్వహించిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్ (%చీణూ%-1) 2024, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ (%జణూ%-1) 2024 రాత పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. రాత పరీక్ష ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు. ఈ పరీక్షలు ఏప్రిల్ 21వ తేదీన దేశవ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో జరిగిన విషయం తెలిసిందే. ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ ఎగ్జామ్ ద్వారా 400 ఖాళీలు, సీడీఎస్ఈ ద్వారా 457 ఖాళీలు భర్తీ చేయనున్నారు. రాత పరీక్షలో ఎంపికైన వారు తదుపరి దశకోసం సన్నద్ధం కావల్సి ఉంటుంది. పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చు.

# మాకు తెలంగాణ ప్రజల సర్టిఫికెట్ కావాలి

**సత్తా లేక పిరికిపందాల్ల బీజేపీ పై తప్పుడు ప్రచారం**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శ**

**హైదరాబాద్:** దుర్మార్గమైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చెరో వైపు సత్తా లేక పిరికిపందాల్ల బీజేపీ పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజలు నవ్వుకుంటున్నారని, రేవంత్, రాహుల్, కెసిఆర్ ల సర్టిఫికెట్ బీజేపీ కి అవసరం లేదన్నారు కిషన్ రెడ్డి. మాకు తెలంగాణ ప్రజల సర్టిఫికెట్ కావాలని, మోడీ లేని భారతాన్ని చూడలేమన్నారు. ఎవరు బాధపడ్డ తెలంగాణ అభివృద్ధి కి కమిట్ మెంట్ తో పనిచేస్తామన్నారు. గాడిద గుడ్డు ను నెత్తిన పెట్టుకొని తిరుగుతున్నాడు రేవంత్ రెడ్డి కి సిగ్గుండాలని, 9 లక్షల కోట్లకు పైగా తెలంగాణ కోసం కేంద్రం ఖర్చు చేసిందన్నారు కిషన్ రెడ్డి. మిడిమిడి జ్ఞానం తో రేవంత్ రెడ్డీ ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ తెలంగాణ ను సర్వనాశనం చేస్తుంది%శొ% ఆ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆయన వ్యాఖ్యానించారు.హైకమాండ్ ఆదేశాలతో 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రజలను కలిశామన్నారు. కాంగ్రెస్‌కు విమర్శించడానికి ఏమీలేకనే దుష్ప్రచారాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. రిజర్వేషన్ల అంశంపైనా కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలు చేసిందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు.

# ఇంకోసారి తప్పు జరగకుండా చూస్తాం

**న్యూఢిల్లీ:** మాల్దీవులు- భారత్ మధ్య కొంత కాలంగా ఓ వివాదం కొనసాగుతోంది. కొద్దినెలల కిందట భారత ప్రధాని మోడీ లక్షద్వీప్ పర్యటన చేశారు. ఆయన సోషల్ మీడియాలో ఫొటోలు పంచుకున్న నేపథ్యంలో మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ తర్వాత నుంచి రెండుదేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు కొనసాగుతున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితి మరోసారి జరగకుండా చూస్తామని ఆ దేశ విదేశాంగమంత్రి మూసా జమీర్ హామీ ఇచ్చారు. మాల్దీవుల విదేశాంగ మంత్రి మూసా జమీర్ మనదేశానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వాళ్లు చేసిన వ్యాఖ్యలు మా ప్రభుత్వ అభిప్రాయం కాదని మేం స్పష్టం చేశాం. అలా జరిగి ఉండాల్సింది కాదు. అలాగే అలాంటి వైఖరి పునరావృతం కాకుండా మేం తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ విషయంలో అపార్థాలు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు ఆ దశను దాటేశాం. భారత్-మాల్దీవుల ప్రభుత్వాలు జరిగిన విషయాన్ని అర్థం చేసుకున్నాయి" అని వెల్లడించారు. పరస్పర ప్రయోజనాల ఆధారంగానే ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతవుతాయి స్పష్టం చేశారు. ఇటీవల ఆ దేశ అధ్యక్షుడు ముయిజ్జు తీసుకున్న భారత వ్యతిరేక నిర్ణయాలు కూడా ఇరుదేశాల మధ్య దూరాన్ని పెంచాయి. ఈ సమయంలోనే జమీర్ భారత్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మన విదేశాంగ మంత్రి జైశంకర్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ఇరుదేశాల పరస్పర ప్రయోజనాలు, సున్నితాంశాలు.. ఒకరినొకరు అర్థం చేసుకోవడంపై ఆధారపడి ఉంటాయని ఈ సమావేశంలో జైశంకర్ స్పష్టం చేశారు. తాము పొరుగు వారికి ప్రథమ ప్రాధాన్యం (నైబర్‌హుడ్ ఫస్ట్ పాలసీ) విధానానికి కట్టుబడి ఉన్నామని, మాల్దీవులకు అవసరం ఉన్న ప్రతిసారీ ఆదుకున్నామని గుర్తు చేశారు. కాగా.. ఈ ఏడాది జనవరిలో మోడీ లక్షద్వీప్ (%ఖుఎంష్ఘునుఎషవవజూ%)లో పర్యటించారు. సముద్రం ఒడ్డున సేద తీరారు. అనంతరం సముద్రంలో స్నార్కెలింగ్ చేశారు. సాహసాలు చేయాలనుకునే వారు.. తమ లిస్ట్‌లో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోవాలని కోరుతూ.. అక్కడి ఫొటోలను షేర్ చేశారు. పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పలువురు నెటిజన్లు అభిప్రాయపడ్డారు. దీనిపై మాల్దీవులు మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. పర్యాటక రంగంలో మాల్దీవులతో పోలిస్తే.. లక్షద్వీప్ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోందని పోస్టు పెట్టారు. దాంతో సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. బాయ్‌కాట్ మాల్దీవ్స్ పేరిట హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అయింది. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టిన మాల్దీవులు.. ఆ వ్యాఖ్యలతో తమ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. అనంతరం సదరు మంత్రుల తొలగించింది.

# 4,44,216 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్

**అత్యధికంగా నెల్లూరులో 22,650 పోస్టల్ ఓట్లు నమోదు**

**ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా**




**అమరావతి:** రాష్ట్ర వ్యాప్తంగా 4,44,216 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముకేశ్‌కుమార్ మీనా తెలిపారు. మే 4 నుంచి నుంచి 9వ తేదీ వరకు 6 రోజుల పాటు పోస్టల్ ఓటింగ్ పక్రియ కొనసాగిందన్నారు. నెల్లూరు పార్లమెంటు పరిధిలో అత్యధికంగా 22,650 పోస్టల్ ఓట్లు నమోదు కాగా... అత్యల్పంగా అమలాపురం పార్లమెంటు పరిధిలో 14,526 ఓట్లు పోలైనట్లు తెలిపారు. పోలైన పోస్టల్ బ్యాలెట్లను స్టాం÷-రగ్ రూమ్‌లకు తరలిస్తున్నట్లు చెప్పారు. అనంతపురం, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలు సహా 14 నియోజకవర్గాల్లో వందశాతం వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు సీఈవో పేర్కొన్నారు. ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా 28 మోడల్ పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పల్నాడు సహా సున్నితమైన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లో రెండేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఈవో కార్యాలయంతోపాటు అన్ని జిల్లాల్లోని కంట్రోల్ రూమ్‌ల ద్వారా పోలింగ్ తీరును పర్యవేక్షిస్తామని ముకేశ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు.

# బాలీవుడ్ గుర్తించడం లేదన్న జ్యోతిక



తాజాగా 'శ్రీకాంత్' సినిమాతో ప్రేక్షకుల ముందుకువచ్చి ఆకట్టుకున్నారు జ్యోతిక. తెలుగు, తమిళ భాషల్లో వరుస చిత్రాల్లో నటించిన ఆమె బాలీవుడ్‌లో మాత్రం 27 ఏళ్ల తర్వాత నటించారు. 1997లో జ్యోతిక నటించిన హిందీ చిత్రం విడుదలైంది. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత 'సైతాన్' అనే సినిమాతో ఈ ఏడాది బీటౌన్ ప్రేక్షకులను పలకరించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ లాంగ్ గ్యాప్ రావడానికి గల కారణాన్ని వివరించారు. 'తొలి చిత్రం ఫలితంపైనే మన కెరీర్ ఆధారపడి ఉంటుందని బలంగా నమ్ముతాను. నేను నటించిన మొదటి హిందీ సినిమా అనుకున్నంత స్థాయిలో ప్రేక్షకులను అలరించలేకపోయింది. దీంతో నాకు అక్కడ అవకాశాలు రాలేదు. దక్షిణాదిలో నేను నటించిన ఎన్నో సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందాను. అయినా.. బాలీవుడ్ నుంచి ఒక్క ఆఫర్ కూడా రాలేదు. ప్రేక్షకులు నన్ను దక్షిణాది నటిగానే గుర్తుంచుకున్నారు. అందుకే నాకూ బాలీవుడ్ చిత్రాల్లో నటించాలని ఆసక్తి లేదు' అని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, బొల్లాంట్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు శ్రీకాంత్ బొల్లా జీవితం ఆధారంగా తెరకెక్కిన 'శ్రీకాంత్'లో జ్యోతిక టీచర్ పాత్రలో కనిపించారు. సూర్య హీరోగా తెరకెక్కనున్న ఓ సినిమాలో జ్యోతిక నటించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

'బెంగుళూరు డేస్' ఫేమ్ అంజలి మేనన్ ఆ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది.

ఇటీవల జ్యోతిక దీనిగురించి మాట్లాడుతూ సరైన స్క్రిప్ట్ కోసం చర్చలు జరుపుతున్నామన్నారు. మంచి కథ ఉంటే సూర్యతో కచ్చితంగా కలిసి నటిస్తానని స్పష్టంచేశారు.



# తెలుగులో కన్నా మళయాలమే బెటర్ సంయుక్త మీనన్

తెలుగు చిత్రసీమలోకి వచ్చిన కొంత కాలంలోనే విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు సంయుక్త. ప్రస్తుతం తెలుగుతోపాటు మలయాళ భాషల్లో వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ టాలీవుడ్‌లో నటించాలంటే కష్టమన్నారు. 'మలయాళంతో పోలిస్తే తెలుగు సినిమాల్లో నటించాలంటే చాలా కష్టం. భాష రాకపోవడం ఒక కారణమైతే.. మేకప్ మరో కారణం. వినడానికి వింతగా ఉన్నా.. నా వరకు అది చాలా పెద్ద విషయం. మలయాళ సినిమాల్లో చేసేటప్పుడు మేకప్ వేసుకోవడం వెంటనే అయిపోతుంది. చాలా లైట్‌గా, సహజంగా వేస్తారు. యాక్టింగ్ చేసేటప్పుడు కూడా పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ, టాలీవుడ్‌లో స్వీయ జాగ్రత్తలు చాలా తీసుకోవాలి. తెరపై ఎలా కనిపిస్తామా.. అని ఎప్పుడూ చూసుకుంటూ ఉండాలి. ఎక్కువ మేకప్ వేస్తారు. షాట్ చేస్తున్నప్పుడు కూడా మేకప్‌ను చెక్ చేసుకోవాలి. ఇది సౌకర్యానికి పూర్తి విరుద్ధం. చర్మం, ముఖంపై ఏదో ఉన్నట్లు అనిపిస్తుంటుంది' అని చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో నిఖిల్ 'స్వయంభూ'లో నటిస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఇది రానుంది. సోషియో ఫాంటసీ చిత్రంగా అత్యంత భారీ బ్జడెట్‌తో రూపొందుతోంది. దీనితో పాటు శర్వానంద్‌తోనూ ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా మూన్్గ ÷న్ పిక్చర్స్ పతాకంపై రానున్న సినిమాలోనూ ఈమెను ఓకే చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ సినిమా చిత్రీకరణ జూన్‌లో ప్రారంభం కానుంది.

# పగ..ప్రతీకారం..కృష్ణమ్మ మూవీ




జయాపజయాలతో సంబంధం లేకుండా వైవిధ్యభరితమైన కథలతో ప్రేక్షకుల్ని అలరించే ప్రయత్నం చేస్తున్నారు సత్యదేవ్. కానీ, కొన్నాళు ్లగా ఆయన నుంచి వచ్చిన ఏ సినిమా హిట్టు మాట వినిపించలేకపోయింది. దీంతో ఈసారి విజయమే లక్ష్యంగా 'కృష్ణమ్మ'తో బాక్సాఫీస్ బరిలో అడుగు పెట్టారు. దీనికి ప్రముఖ దర్శకుడు కొరటాల శివ సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం.. పాటలు, ప్రచార చిత్రాలు ఆకట్టుకునేలా ఉండటంతో ప్రేక్షకుల చూపు ఈ సినిమాపై పడింది. అనాథలైన భద్ర (సత్యదేవ్), శివ (కృష్ణ బూరుగుల), కోటి (లక్ష్మణ్ మీసాల) చిన్నప్పటి నుంచి ప్రాణ స్నేహితులు. చిన్నతనంలోనే జైలు జీవితం గడిపిన శివ బయటకొచ్చాక ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకుని జీవనం సాగిస్తుంటాడు. భద్ర, కోటి మాత్రం గంజాయి స్మగ్లింగ్ చేసి పొట్ట నింపుకొంటుంటారు. వీళ్లంతా తమకంటూ ఓ కుటుంబం ఉండాలని ఆశ పడతారు. ఈ క్రమంలోనే మీనా తో శివ ప్రేమలో పడతాడు. ఆమె భద్రకు రాఖీ కట్టడంతో తనూ ఆమెను సొంత చెల్లిగా చూడటం మొదలు పెడతాడు. ఆ తర్వాత స్మగ్లింగ్ వంటి తప్పుడు పనులు మానేసి ఆటో నడుపుతూ సొంత కాళ్లపై నిలబడే ప్రయత్నం చేస్తాడు భద్ర. అయితే ఓసారి మీనా తల్లి ఆపరేషన్‌కు రూ.2లక్షలు అవసరమైతే.. ఆ డబ్బు సంపాదించడం కోసం భద్ర, శివ, కోటి తప్పనిసరి పరిస్థితుల్లో గంజాయి స్మగ్లింగ్ చేయడానికి సిద్ధపడతారు. అలా వాళ్లు పాడేరు నుంచి వైజాగ్‌కు గంజాయి తీసుకొచ్చే క్రమంలో పోలీసులకు దొరికిపోతారు. సరిగ్గా అప్పుడే వాళ్లు అనుకోకుండా ఓ యువతి హత్యాచారం కేసులోనూ ఇరుక్కుంటారు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్యాచారానికి గురైన అమ్మాయి ఎవరు? ఈ కేసు ఏమిటన్నది తెలియకుండానే దాన్ని భద్ర, కోటి, శివ తమపై వేసుకోవడానికి కారణమేంటి? కేసు గురించి తెలిశాక ఈ ముగ్గురు ఏం చేశారు? శివని పెళ్లి చేసుకోవాలని ఎదురు చూస్తున్న మీనా ఏమైంది? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. స్నేహంతో ముడిపడి ఉన్న ప్రతీకార కథ ఇది. బలమైన భావోద్వేగాలతో రా రస్టిక్ కోణంలో సాగుతుంది. అయితే ఈ అసలు కథలోకి ప్రేక్షకుల్ని తీసుకెళ్లడానికి దర్శకుడు చాలా సమయమే తీసుకున్నాడు. ఒకరకంగా ప్రథమార్ధమంతా సాగతీత వ్యవహారమే. అడవిలో జరిగే ఓ హత్యతో సత్యదేవ్ పాత్రను పరిచయం చేస్తూ.. కథను ఆరంభించిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. ఆ తర్వాత భద్ర, శివ, కోటిల గతాన్ని చూపిస్తూ నెమ్మదిగా సినిమాని ముందుకు నడిపించాడు దర్శకుడు. వీళ్ల ముగ్గురి స్నేహం, మీనాతో శివ ప్రేమలో పడటం.. మొదట్లో వీళ్ల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు.. ఆఖరికి వాళ్లంతా ఓ కుటుంబంలా కలిసిపోవడం.. అంతా రొటీన్ వ్యవహారంలా సాగుతుంది. ఈ మధ్యలో హీరోకి ఓ చిన్న లవ్‌ట్రాక్ తగిలించే ప్రయత్నం చేశారు దర్శకుడు. కానీ, అదీ ఏమాత్రం మెప్పించదు. విరామానికి ముందు భద్ర తన మిత్రులతో కలిసి గంజాయి స్మగ్లింగ్‌కు సిద్ధమవడం.. దాన్ని తీసుకొచ్చే క్రమంలో పోలీసులకు దొరికిపోవడం.. అదే సమయంలో అనుకోకుండా ఓ హత్యాచారం కేసును తమపై వేసుకోవడంతో అసలు కథ మొదలవుతుంది. ఇక్కడి నుంచి ద్వితీయార్ధమంతా సీరియస్ టోన్‌లో సాగిపోతుంది. హత్యాచారానికి గురైన యువతి ఎవరన్నది తెలిశాక భద్ర, కోటి, శివ పోలీసులపై తిరగబడే సన్నివేశాలు ఆసక్తిరేకెత్తిస్తాయి. పోలీసులు వాళ్లని చిత్రహింసలకు గురి చేసి బలవంతంగా ఆ కేసును ఒప్పించే సీక్వెన్స్ 'జైభీమ్', 'విచారణ' చిత్రాల్ని గుర్తు చేస్తుంది. భద్ర, కోటి జైలు నుంచి బయటకు వచ్చాక చేసే వరుస హత్యలు థ్రిల్లింగ్‌గా ఉంటాయి. ముగింపు ఊహలకు తగ్గట్లుగా ఉన్నా.. పతాక సన్నివేశాలు భావోద్వేగభరితంగా అనిపిస్తాయి.

# సుహాస్ కొత్త సినిమా..గొర్రె పురాణం

టాలీవుడ్ టాలెంటెడ్ నటుడు సుహాస్ ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా ఉన్నాడు. ఇటీవలే అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్, ప్రసన్నవదనం సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. సరికొత్త కథా, కథనాలతో వచ్చిన ఈ రెండు సినిమాలు కూడా మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు మరో వినూత్న కథతో ఆడియన్స్ ముందుకు రానున్నాడు సుహాస్. అదే గొర్రె పురాణం. బాబీ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుండి తాజాగా టీజర్ విడుదల చేశారు మేకర్స్. వినూత్న కథతో వస్తున్న ఈ టీజర్ చాలా కొత్తగా ఉంది. ఇప్పుడొక మీకొక బ్రేకింగ్ న్యూస్.. ఒక గ్రామంలో రెండు వర్గాల మధ్య ఒక గొర్రె చిచ్చు పెట్టింది. అనే వాయిస్ ఓవర్ తో స్టార్ట్ అయ్యింది ఈ టీజర్. తరువాత.. ఆ గొర్రె మాది అంటే మాది అని అంటూ హిందూ, ముస్లింలు వాదించుకుంటారు. అలా చిన్నగా మొదలైన గొడవ గ్రామ సమస్యగా మారుతుంది. ఇక సుహాస్ జైల్లో ఖైదీలా కనిపించారు. మరి సుహాస్ కి ఆ గొర్రె పిల్లకి ఏమైనా సంబంధం ఉందా అనేది ఆసక్తికరంగా మారింది. ఈ టీజర్ తో సినిమాపై మంచి ఇంట్రెస్ట్ క్రియేట్ చేశారు. మరి మరో కొత్త కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమా ఎలాంటి విజయాన్నీస్ సాధిస్తుందో చూడాలి.




# రవితేజ వారసుడు మాధవ్ హీరోగా.. మిస్టర్ ఇడియట్

మాస్ మహరాజ్ రవితేజ వారసుడు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా 'మిస్టర్ ఇడియట్' ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంట్టంల్గ÷న్మెంట్స్ పతాకంపై శ్రీమతి యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జే ఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'పెళ్లి సందడి' చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. తాజాగా శుక్రవారం 'మిస్టర్ ఇడియట్' చిత్రం టీజర్ ను రవితేజ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ఈ టీజర్ ను చూస్తే.. ధృవ ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజీలో చదివే సత్య (హీరోయిన్ సిమ్రాన్ శర్మ) కాలేజ్ టాపర్. ఆమె డిజైన్ గీస్తే ది బెస్ట్ గా నిలవాల్సిందే. కాలేజ్ లో సత్య మెరిట్ ను బీట్ చేయడం ఎవరి వల్లా కాదు. అలాంటి టైమ్ లో కాలేజ్ లో అడుగు పెడతాడు హీరో (మాధవ్). సత్యను న గుణింతంతో పిలుస్తూ సరదాగా టీజ్ చేస్తుంటాడు. హీరోయిన్ ను హీరో గుణింతంతో ఎందుకు పిలుస్తున్నాడు? అల్లరిగా సాగే వీరి స్నేహం ప్రేమగా ఎలా మారింది ? అనేది టీజర్ లో ఇంట్రెస్టింగ్ గా చూపించారు. ÷ాధవ్ రవితేజ లా ఎనర్జిటిక్ గా కనిపించాడు. స్టైలిష్ లుక్స్ తో పాటు పర్ ఫార్మెన్స్ లోనూ ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'మిస్టర్ ఇడియట్' సినిమా త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేయబోతున్నారు.



# వాస్తవ ఘటనల నింద



'హ్యాపీ డేస్, కొత్త బంగారు లోకం' చిత్రాల ఫేమ్ వరుణ్ సందేశ్ హీరోగా రూపొందిన చిత్రం 'నింద'. 'కాండ్రకోట మిస్టరీ' అన్నది ఉపశీర్షిక. ఆనీ, తనికెళ్ల భరణి, భద్రం, సూర్యకుమార్, ఛత్రపతి శేఖర్ ఇతర పాత్రల్లో నటించారు. ది ఫర్వెంట్ ఇండీ ప్రోడక్షన్స్ బ్యానర్ రాజేష్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ చిత్రం నుంచి వరుణ్ సందేశ్ పాత్ర ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత రాజేష్ జగన్నాథం మాట్లాడుతూ "వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'నింద'. ఇప్పుడు ప్రేక్షకులు రెగ్యులర్ సినిమాల కంటే కంటెంట్, కాన్సెప్ట్ బేస్డ్ సినిమాలనే ఎక్కువగా ఆదరిస్తున్నారు.

ఈ కోవలోనే మా 'నింద' రూపొందింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రోడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఈ నెల 15న మా సినిమా టీజర్‌ను విడుదల చేస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సంతు ఓంకార్, కెమెరా: రమీజ్ నవీత్.